సచివాలయాలకు చంద్ర గ్రహణం!

- కళను కోల్పోతున్న సచివాలయాలు
- గతంతో పోలిస్తే 75 శాతం సేవలు కట్
- ఇబ్బందులు పడుతున్న గ్రామీణ ప్రజానీకం


క్షేత్రస్థాయిలో ప్రభుత్వ పథకాలను లబ్ధిదారులకు అందిస్తున్న సచివాలయ సిబ్బంది, వలంటీర్ (ఫైల్)

సుండుపల్లె : గతంలో గ్రామీణులు ఏ చిన్న పని ఉన్నా వేకువజామునే లేచి మండల కేంద్రానికో.. జిల్లా కేంద్రానికో బయలుదేరేందుకు సిద్ధపడాల్సి వచ్చేది. దీంతో ఉదయం పూట చేసుకునే వ్యవసాయ పనులకు ఇబ్బందులు ఎదురయ్యేవి. పైగా సదరు సమస్యపై రోజుల కొలది కార్యాలయాల చుట్టూ తిరిగినా పనులు అయ్యేవికావు. ఇది గ్రహించిన గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ స్వరాజ్యం తీసుకురావాలనే బృహత్ సంకల్పంతో పంచాయతీ కేంద్రంలో సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి రైతులు, గ్రామీణులకు సమస్యల పరిష్కార వ్యవస్థను అందుబాటులోకి తెచ్చి, ప్రజలకు 139 రకాల సేవలను అందించేవారు. ప్రతి రోజూ గ్రీవెన్స్ ఏర్పాటు చేసి వచ్చిన ప్రతి అర్జీకి పరిష్కార మార్గం చూపేవారు. అలానే రైతులు, గ్రామీణులకు అవసరమైన ధృవీకరణ పత్రాలు సచివాలయాల ద్వారా పొందేవారు. అలానే సంక్షేమ పథకాలు అందించడంలోనూ ఈ వ్యవస్థ క్రియాశీలకంగా వ్యవహరించింది.

కూటమి పాలనలో సచివాలయాలకు..

వైఎస్ జగన్ ప్రభుత్వంలో మహర్దశ పొందిన సచివాలయాలకు 2024 ఎన్నికల అనంతరం కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక చిన్నచూపునకు గురయ్యాయి. ప్రజలకు 139 రకాల సేవలను అందించే సచివాలయాల్లో 75 శాతం పైగా సేవలను కూటమి ప్రభుత్వం దూరం చేసింది. దీంతో ఏ పథకానికి పేర్లు నమోదు చేసుకోవాలన్న మీ–సేవా కేంద్రాలకు లబ్ధిదారులు పరుగులు పెట్టాల్సిన పరిస్థితి. ఇటీవల సీఎం చంద్రబాబు నాయుడు రైతులకు గత ప్రభుత్వం చెల్లిస్తూ వచ్చిన పంట బీమా పథకం ప్రీమియంను తీసివేసింది. దీంతో రైతులే పంటల బీమా ప్రీమియంను చెల్లించాల్సిన దుస్థితి దాపురించింది. పైగా వీటిని నమోదు చేసుకునేందుకు మీ–సేవా కేంద్రాల బాట పట్టాల్సి వస్తోంది. జగన్ ప్రభుత్వంలో ఇంటికే వచ్చి వలంటీర్లు సంక్షేమ పథకాలకు పేర్లు నమోదు చేసుకుని లబ్ధి చేకూర్చేవారని కూటమి ప్రభుత్వం వచ్చాక రైతులను ఇబ్బందులకు గురి చేస్తోందని వాపోతున్నారు. ప్రస్తుతం పింఛన్లకు, రేషన్ కార్డులకు దరఖాస్తులు చేసుకుందామని సచివాలయాలకు వెళితే సర్వర్ పని చేయడంలేదని చెబుతుండటంతో మండలంలోని లబ్ధిదారులు ఏమీ చేయలేని పరిస్థితుల్లో వెనక్కి వెళుతున్నారు.


సుండుపల్లె మండలంలోని ఈడిగపల్లె సచివాలయ భవనం

సంక్షేమ సారథులు వలంటీర్లు

గత ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు ప్రతి అర్హుడికి అందాయి. ఇందులో ప్రధాన భూమిక పోషించింది వలంటీర్లే అని చెప్పాలి. ఏ పథకమైన ప్రతి అర్హుడికి అందాలనే మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయానికి అనుగుణంగా వలంటీర్లు పని చేశారు. అలానే కరోనా కష్టకాలంలో వీరు చేసిన సేవలు వెల కట్టలేనివి. కాగా గతంలో చంద్రబాబు వలంటీర్ల వ్యవస్థపై నోరుపారేసుకున్నప్పటికీ ఎన్నికల ప్రచారంలో వలంటీర్ల వ్యవస్థను కొనసాగించి వారి గౌరవ వేతనాన్ని రూ.10 వేలకు పెంచుతామని, ఉద్యోగ భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చారు. తీరా అధికారంలోకి వచ్చాక వలంటీర్ల వ్యవస్థ అనేది లేదని, వాటిని కొనసాగించడం అనే ప్రశ్న ఉత్పన్నం కాదని అసెంబ్లీ సాక్షిగా తన మంత్రుల ద్వార తెలియజేసి వలంటీర్లను వెన్నుపోటు పొడిచాడు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు కావొస్తున్న వలంటీర్లకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని వలంటీర్లు, ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీల నాయకులు డిమాండ్ చేస్తున్నప్పటికీ తమకేమీ పట్టనట్టుగా వ్యవహరిస్తుండటం వలంటీర్లను, ప్రజలను ఆందోళనకు గురి చేస్తోంది. కాగా మండలంలో గ్రామ సచివాలయాల సంఖ్య 15, సచివాలయాలలోని ఉద్యోగస్తులు 133 మంది, మండలంలో సచివాలయాలలో వలంటీర్లు 258 మంది పని చేస్తున్నారు.

వలంటీర్లను విధుల్లోకి తీసుకోవాలి



గత ప్రభుత్వంలో సుండుపల్లె–2 గ్రామ సచివాలయంలో వలంటీర్‌గా విధులు నిర్వహించాను. ఈ ప్రభుత్వం ఎన్నికల హామీలో వలంటీర్లను యథావిధిగా కొనసాగిస్తామని, గౌరవ వేతనం రూ .5 వేలు నుంచి రూ. 10 వేలు ఇచ్చి ఉద్యోగ భద్రతను కల్పిస్తామని చెప్పి ప్రభుత్వం వచ్చి ఆరు నెలలు పూర్తయినా ఇంతవరకు వలంటీర్లు గురించి ఎటువంటి హామీని ఇవ్వలేదు. తక్షణమే మా లాంటి వలంటీర్లను విధుల్లోకి తీసుకోవాలని కోరుకుంటున్నాను.

– బండి నాగరాజు, కటవకిందపల్లె, వలంటీర్, సుండుపల్లె మండలం

సచివాలయాల్లో సేవలు కొనసాగించాలి



సచివాలయాలు లేక ముందు చిన్న సర్టిఫికేట్ కావాలన్న మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వచ్చేది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సచివాలయాల్లోనే చాలా వరకు ప్రభుత్వ సేవలను అందుకున్నాం. ప్రస్తుతం ఏ చిన్న పని కావాలన్న మరి తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లాలని సచివాలయ సిబ్బంది తెలియజేస్తున్నారు. కూటమి ప్రభుత్వం సచివాలయాల్లోనే గతంలో అందే సేవలను అందించాలని కోరుతున్నాం.

– వెంకటసుబ్బమ్మ, మల్లక్కగారిపల్లి, సుండుపల్లి మండలం

భూ ఆక్రమణను అడ్డుకోండి


తహసీల్దార్‌కు సమస్యను వివరిస్తున్న గ్రామస్తులు

గాలివీడు : మండలంలోని నూలివీడు గ్రామం నాగూరివాండ్లపల్లె సమీపంలో ఉన్న ప్రభుత్వ భూమిని వీఆర్‌ఓ కుటుంబ సభ్యులు కబ్జా చేసి భూమి చదును చేశారు. దీనిపై తహసీల్దార్ భాగ్యలతకు గ్రామస్తులు సోమవారం ఫిర్యాదు చేశారు. గ్రామంలో పూర్వీకులు పశువుల ప్రదర్శన చేసే స్థలాన్ని వీఆర్‌ఓ కుటుంబసభ్యులు ఎవరికీ తెలియకుండా వారి పేరిట పట్టా చేయించుకున్నారని, ప్రస్తుతం ఆ భూమిలో చదును చేసే పనులు చేస్తున్నారని వాటిని అడ్డుకుని పట్టాను రద్దు చేయాలని తహసీల్దార్‌కు విన్నవించారు.

విద్యారంగానికి పెద్దపీట

రాయచోటి టౌన్ : విద్యారంగానికి సీఎం చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పెద్దపీట వేస్తున్నారని రాష్ట్ర రవాణా, క్రీడల, యువజన శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. సోమవారం గాలివీడు మార్గంలోని అర్చన విద్యాసంస్థలలో పునాది అక్షరాస్యత, సంఖ్యాశాస్త్రం ఫౌండేషన్ లిటరసీ న్యూమరసీ (ఎఫ్ఎల్ఎన్)పై ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు రెండవ బ్యాచ్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన ఉపాధ్యాయులు పిల్లలకు అర్థం అయ్యే రీతిలో బోధనలు చేయాలని సూచించారు. మాతృభాషలో విద్యను బోధించాలని తెలిపారు. కార్యక్రమంలో డీఈఓ సుబ్రహ్మణ్యం, అసిస్టెంట్ ఏఎంఓ సమీవుల్లా, ఎంఈఓలు శ్రీనివాసులు, ఆంజనేయులు నాయుడు, రాజశేఖర్, జయచంద్ర, వెంకటసుబ్బయ్య, పీడీ వీరాంజి, రీసోర్స్ పర్సన్స్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు మాజీ ఎమ్మెల్యే గాలివీటి విశ్వనాథరెడ్డి వర్ధంతి

- హాజరుకానున్న ఎంపీ పీవీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డిలు

వీరబల్లి : లక్కిరెడ్డిపల్లె మాజీ ఎమ్మెల్యే కీ.శే. గాలివీటి విశ్వనాథరెడ్డి 8వ వర్ధంతి వేడుకలు మంగళవారం (నేడు) మండల కేంద్రంలో నిర్వహించనున్నట్లు ఆయన కుమారులు వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు గాలివీటి విజయభాస్కర్‌రెడ్డి, వీరబల్లి ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథ్‌రెడ్డిలు తెలిపారు. ఈ కార్యక్రమానికి రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డిలు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పార్టీ నాయకులు, అభిమానులు హాజరుకావాలని తెలియజేశారు.

నేడు పింఛా డ్యాం నీటి సంఘం ఎన్నిక

సుండుపల్లె(రాజంపేట) : పింఛా డ్యాం నీటి సంఘం ఎన్నికను మంగళవారం నిర్వహించనున్నారు. ఈ మేరకు పింఛా డ్యాం ఏఈ, ఎన్నికల అధికారి బుక్కే నాగేంద్రనాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆయకట్టుదారులు నోటిఫికేషన్‌లో పొందుపరిచిన విధంగా ఎన్నిక జరుగుందని వారు తెలియజేశారు. ఆరు టీసీలకు ఎన్నికలు జరుగుతాయని పేర్కొన్నారు. కాగా ఫర్షణ వాతావరణం కారణంగా ఈ నెల 14న జరగాల్సిన ఎన్నిక వాయిదాపడిన విషయం విధితమే.

నేడు ఉచిత వైద్య శిబిరం

రామాపురం : మండల పరిధిలోని చిట్లూరు కస్పా శివాలయం వద్ద మంగళవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 3గంటల వరకు తిరుపతికి చెందిన రమాదేవి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వారిచే ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నామని టీడీపీ మండల నాయకులు గాలివీటి సురేంద్రనాథరెడ్డి తెలిపారు. వైద్య శిబిరంలో కిడ్నీ, ఎముకలు, కీళ్లు సంబంధించిన వ్యాధులకు ఉచితంగా వైద్యం అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, శిబిరానికి వచ్చేవారు తప్పనిసరిగా ఆధార్‌కార్డు, దీర్ఘకాల వ్యాధులకు సంబంధించిన రోగులు తమ రిపోర్టులను తీసుకురావాలని తెలియజేశారు.

రేపటి నుంచి ఆధార్ క్యాంపులు

చిట్వేలి : మండలంలోని అంగన్‌వాడీ సెంటర్లలో ఈనెల 17 నుంచి 20వ తేదీ వరకు, 26వ తేదీ నుంచి 28వ తేదీ వరకు స్పెషల్ ఆధార్ క్యాంపులను నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ మోహన్ తెలియజేశారు. పంచాయతీ కార్యదర్శులు, మహిళా పోలీసులు, అంగన్‌వాడీ టీచర్లు ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పుల్లంపేటలో..

పుల్లంపేట : మండలంలోని అంగన్‌వాడీ సెంటర్లలో ఈనెల 17 నుంచి 28వ తేదీ వరకు అంగన్‌వాడీ సెంటర్లలో ఉచిత ఆధార్ కేంద్రాలు నిర్వహించనున్నట్లు ఏఓ శ్రీధర్ రెడ్డి తెలిపారు.

నివాళి



నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే అమర్‌నాథరెడ్డి

పెనగలూరు : మండలంలోని నారాయణ నెల్లూరు గ్రామంలో సోమవారం మృతి చెందిన భీమ్ రాజారెడ్డి మృతదేహానికి ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి సోమవారం నివాళులర్పించారు. కార్యక్రమంలో రాజంపేట జెడ్పీటీసీ సభ్యుడు దాసరి పెంచలయ్య, విశ్వనాథరెడ్డి, సుబ్బరాజు, శంకర్ శెట్టి, చికెన్ శ్రీను, కమల తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

రాజంపేట టౌన్ : పట్టణంలోని నలంద నగర్‌లో ఉంటున్న నాగ పిచ్చిరెడ్డి, మండలంలోని బ్రాహ్మణపల్లెకు చెందిన ప్రభాకర్‌రెడ్డి ఇటీవల మృతి చెందారు. సోమవారం ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే నందలూరు మండలం మర్రిపల్లెకు చెందిన నరసింహులు ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందడంతో ఎమ్మెల్యే ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్న నరసింహులు మృతదేహాన్ని సందర్శించి కుటుంబ సభ్యులను ఓదార్చి తాను అండగా ఉంటానని వారికి భరోసా ఇచ్చారు.

ఏఓకు సత్కారం


ఏఓ అనంతప్రకాష్‌ను సత్కరిస్తున్న ఎంపీపీ

నందలూరు : మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో విధులు నిర్వర్తించి డిప్యుటేషన్‌పై కమలాపురానికి వెళ్తున్న ఏఓ అనంత ప్రకాష్‌ను మండల పరిషత్ అధ్యక్షులు మేడా విజయభాస్కర్ రెడ్డి, కార్యాలయ సిబ్బంది సోమవారం ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సుజాతమ్మ, మండల కో–ఆప్షన్ సభ్యులు కరిముల్లాఖాన్, కాంట్రాక్టర్ నదివీధి సుధాకర్, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉజ్వల భవిష్యత్తుకు పిల్లలను బడికి పంపండి


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ మల్‌రెడ్డి

ఓబులవారిపల్లె : ఉజ్వల భవిష్యత్తుకు తల్లిదండ్రులు పిల్లలను పనులకు కాకుండా బడికి పంపాలని ఎంపీడీఓ మల్‌రెడ్డి తెలియజేశారు. స్థానిక ఎంపీడీఓ సభా భవనంలో సోమవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాలల కిషోర్ వికాసంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ బాల కార్మికులను పనిలో పెట్టుకోవడం నేరమని, వ్యాపారులు, పారిశ్రామికవేత్తలు ఈ విషయంపై అవగాహన కల్పించుకోవాలన్నారు.

అనంతరం ముక్కవారిపల్లి వైద్యాధికారిణి రూప మాట్లాడుతూ నిర్దేశించిన వయస్సులో వివాహాలు జరిపించాలని లేదంటే ఆరోగ్యపరమైన సమస్యలు తలెత్తుతాయని చెప్పారు. ఐసీడీఎస్ సీడీపీఓ సౌభాగ్యమ్మ మాట్లాడుతూ బడి బయట ఉన్న విద్యార్థులను పాఠశాలలో చేర్పించాలన్నారు. అనంతరం ఏఎస్ఐ శ్రీనివాసులు మాట్లాడుతూ విదేశాలలో ఉండే తల్లిదండ్రులు తమ పిల్లలపై ప్రేమతో వాహనాలు కొనిస్తున్నారని, చిన్న వయస్సులోనే స్కూటర్లు నడపడం ద్వార ప్రమాదాలకు గురై చాలా మంది మృత్యువాత పడటం, అంగవైకల్యం పొందడం లాంటి సంఘటనలు జరుగుతున్నాయని తెలిపారు. పిల్లలకు స్కూటర్లు ఇవ్వరాదని సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీఓ సరళ, కో–ఆర్డినేటర్ శంకర్, ఏఎన్ఎంలు, మహిళా పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించండి


కలెక్టరేట్ ముందు నిరసన ప్రదర్శన చేస్తున్న ఉపాధ్యాయులు

- జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరికి గిరిజన పాఠశాలల ఉపాధ్యాయుల వినతి

రాయచోటి అర్బన్ : ఉద్యోగ భద్రత కల్పించాలంటూ జిల్లాలోని గిరిజన గురుకుల పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించాలంటూ గిరిజన గురుకుల పాఠశాలల ఉపాధ్యాయులు సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా గిరిజన గురుకుల పాఠశాలల ఉపాధ్యాయుల అసోసియేషన్ నేతలు శ్రీనివాసులు నాయక్, సరోజ, హరితలు మాట్లాడుతూ తాము గిరిజన గురుకుల పాఠశాలల్లో గత 10 సంవత్సరాలుగా పనిచేస్తున్నామన్నారు. సాధారణంగా తాము పనిచేస్తున్న స్థానాల్లో ప్రభుత్వం డీఎస్సీ ద్వారా టీచర్ల నియామకాలను చేపట్టాలని చూస్తుండటం దారుణమన్నారు. సాధారణంగా చనిపోయిన, రిటైర్ అయిన వారి స్థానాల్లో డీఎస్సీ నియామకాలు చేపడతారన్నారు. ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేసే వారిని తొలగించి వారిని డిమోషన్ చేసి పార్ట్‌టైం టీచర్స్‌గా మార్చే విధానం దేశంలో ఎక్కడా లేదని, కేవలం ఒక్క ఏపీలోనే తీసుకువస్తుడటం దారుణమన్నారు. ప్రభుత్వం ఇలాంటి నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. గిరిజన ఉపాధ్యాయులకు 2022 పీఆర్‌సీ ప్రకారం వేతనాలను పెంచాలని, కాంట్రాక్టు టీచర్స్‌గా పదోన్నతిని కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఈ మేరకు జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు, కార్యదర్శి భాగ్యలక్ష్మి, గిరిజన గురుకుల పాఠశాలల ఉపాధ్యాయులు మహాదేవ్, విజయకుమారి, స్వర్ణ, లక్ష్మి దేవి, రెడ్డెమ్మ, ప్రదీప్, సౌజన్య, దేవి, కాదంబరి, గీత, సుమతి, ప్రకాష్, వనిత, త్రివేణి, కల్ప, సుహాసిని, చందన, సుజాత, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ల మంజూరులో నిబంధనలు బేఖాతరు

గుర్రంకొండ : ట్రాన్స్‌ఫార్మర్ల మంజూరులో నిబంధనలు పాటించడంలేదనే వాదనను రైతులు తెలియజేస్తున్నారు. మండంలోని పలు గ్రామాల్లో రైతులు బోర్లు వేసుకొని వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల కోసం గతంలో దరఖాస్తులు చేసుకున్నారు. నిబంధనల మేరకు దరఖాస్తు చేసుకొన్న రైతులకు వరుస క్రమంలో విద్యుత్ కనెక్షన్లతోపాటు ట్రాన్స్‌ఫార్మర్లు అధికారులు ఇవ్వాల్సి ఉంది. ప్రస్తుతం ట్రాన్స్‌కో అధికారులు నిబంధనలకు నీళ్లు వదిలి గ్రామాల్లో ఇష్టానుసారంగా వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లు ఇస్తున్నారు. కొన్ని గ్రామాల్లో ఇంతవరకు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల కోసం దరఖాస్తు చేసుకోని వారికి సైతం ట్రాన్స్‌ఫార్మర్లు ఇస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. దరఖాస్తు చేసుకొని నెలల తరబడి వేచిచూస్తున్న రైతులకు మాత్రం ట్రాన్స్‌ఫార్మర్లు ఇవ్వడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. కొన్ని గ్రామాల్లో సీరియల్‌గా ఒకరైతు పేరు మీద మంజూరైన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ట్రాన్స్‌కో సిబ్బంది అనధికారికంగా అనర్హులైనవారికి, దరఖాస్తు చేసుకోని వారికి ఇస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై ఇటీవల రామాపురంలో రైతులు, ట్రాన్స్‌కో సిబ్బంది మధ్య వాగ్వాదం. తమకు జరిగిన అన్యాయంపై రైతులు ట్రాన్స్‌కో సిబ్బందిని ప్రశ్నించినా సరైన సమాధానం ఇవ్వలేదని రైతులు చెబుతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, జిల్లా ఉన్నతాధికారులు స్పందించి అర్హులకు ట్రాన్స్‌ఫార్మర్లు దక్కేలాగా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

నిరుద్యోగులకు ఉచిత శిక్షణ

కడప కోటిరెడ్డిసర్కిల్ : జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బెంగుళూరులో కంప్యూటర్, ట్యాలీ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పిస్తామని ఉన్నతి ఫౌండేషన్ అడ్మిషన్ కో ఆర్డినేటర్ హరిప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. 18–28 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి టెన్త్ పాస్, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ పాస్/ఫెయిల్ అయిన వారు అర్హులన్నారు. 35 రోజులపాటు శిక్షణా కాలం ఉంటుందని, శిక్షణలో భోజనం, వసతి సౌకర్యం కల్పిస్తారన్నారు. మరిన్ని వివరాలకు 90004 87423 నెంబరులో సంప్రదించాలన్నారు.

రాష్ట్రకమిటీలో పుల్లయ్యకు చోటు



రాజంపేట టౌన్ : యాదవ ఎంప్లాయిస్ సొసైటీ రాష్ట్ర కమిటీలో రాజంపేట మండలం ఊటుకూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఇంగ్లిష్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న గోగల పుల్లయ్యకు చోటు దక్కింది. ఈనెల 15వ తేదీ గుంటూరులో జరిగిన రాష్ట్ర కమిటీ ప్రతినిధుల సమావేశంలో యూనియన్ నాయకులు తనను రాష్ట్ర కమిటీకి ఎన్నుకున్నట్లు పుల్లయ్య సోమవారం ఇక్కడి విలేకరులకు తెలిపారు. యాదవ ఎంప్లాయిస్ సమస్యల పరిష్కారం కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తానని చెప్పారు.

అన్నదానం

రామాపురం : లయన్స్‌క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ ఆధ్వర్యంలో మండలంలోని బండపల్లె వద్ద ఉన్న ప్రేమాలయం వృద్ధాశ్రమంలో సోమవారం వీరబల్లి మండలం సానిపాయి గ్రామానికి చెందిన పైడి వెంకటయ్య 3వ వర్ధంతి సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు అధ్యక్షులు లయన్ శివారెడ్డి, జోన్ చైర్మన్ లయన్ మహమ్మద్‌లు పేర్కొన్నారు.

యోగభోగేశ్వరుడికి రుద్రాభిషేకం


ప్రత్యేక అలంకరణలో యోగభోగేశ్వరుడు

మదనపల్లె సిటీ : స్థానిక బెంగుళూరురోడ్డులోని శ్రీ యోగభోగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం స్వామి జన్మనక్షత్రం ఆరుద్ర నక్షత్రం పురస్కరించుకుని ఆలయంలో స్వామికి రుద్రాభిషేకం చేశారు. ఆలయాన్ని ప్రత్యేక పూలతో అలంకరించారు. ఆలయ ఆవరణంలో స్వామి ఉత్సవ విగ్రహాలు ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పెద్ద ఎత్తున స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఈఓ రమణ, ఆలయ సిబ్బంది అంకన్న, రాజశేఖర్ పాల్గొన్నారు. స్థానిక సీటీఎం రోడ్డులోని మంజునాథస్వామి ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలు చేశారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

సిద్దవటం : మండలంలోని మాచుపల్లె పెన్నానది నుంచి ఇసుకను అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టర్‌లను సోమవారం స్వాధీనం చేసుకున్నామని ఒంటిమిట్ట సీఐ టి.బాబు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం గృహ అవసరాల నిమిత్తం మాత్రమే ఉచిత ఇసుక విధానం అమలు చేసిందన్నారు. అక్రమంగా ట్రాక్టర్ల ద్వారా కడప నగరానికి ఇసుక తరలిస్తున్న విషయాన్ని స్థానికులు సమాచారం ఇవ్వడంతో మాచుపల్లె, కడప రహదారిలో రెండు వాహ నాలను పట్టుకొని సిద్దవటం తహసీల్దార్‌కు అప్పజెప్పామన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఇన్‌చార్జి ఎస్ఐ శివప్రసాద్, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో లాభాలు


జీవామృతాల ఉపయోగాలను రైతులకు వివరిస్తున్న మాస్టర్ ట్రైనర్ వెంకటరమణ

గాలివీడు : ప్రకృతి వ్యవసాయంతో అనేక లాభాలున్నాయని ప్రకృతి వ్యవసాయ అధికారులు తెలిపారు. సోమవారం మండలంలోని నూలివీడు పరిధిలో ఉన్న అరవీడు, ప్యారం పల్లి, పందికుంట, గోరాన్ చెరువు గ్రామాలలో ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ వెంకటరమణ ఆధ్వర్యంలో ఘన జీవామృతం, ద్రవ జీవామృతం తయారీ విధానాన్ని రైతులకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఘన, ద్రవ జీవామృతాలు వాడటం వల్ల నేలలు సారవంతం అవ్వడమే కాక తేమశాతం మెండుగా ఉంటుందన్నారు. ఘన, ద్రవ జీవామృతం వాడటం వల్ల నేలలో నిద్రావస్థలో ఉన్న సూక్ష్మజీవులు మేల్కొని మొక్కలకు పోషక విలువలు అధికంగా అందుతాయన్నారు. జీవామృతం మొక్కలకు పిచికారీ చేయడం వలన పురుగులు, తెగులును నివారించుకునే ఆస్కారం ఉంటుందన్నారు. ప్రతి రైతు కూడా ఘన, ద్రవ జీవావృతాలు నేల దుక్కిలో వేసుకొని కలియదున్నుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మోడల్ మేకర్ రామయ్య, డిజిటల్ నరసింహ, యూనిట్ ఇన్‌చార్జులు నాగరాజు, వెంకటరమణ, నాగరాజు, స్వాతి, యశోదమ్మ, ఐసీఆర్‌పీలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

బాలికల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత


రైల్వేకోడూరు అర్బన్: మాట్లాడుతున్న ఎంపీడీఓ


పుల్లంపేట: ప్రతిజ్ఞ చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

రైల్వేకోడూరు అర్బన్ : బాలికల సంరక్షణ తల్లిదండ్రులుగా, అన్నదమ్ములుగా ప్రతి ఒక్కరి బాధ్యత అని సోమవారం ఎంపీడీఓ నాగార్జున తెలిపారు. స్థానిక ఎంపీడీఓ సభా భవనంలో కిశోరి వికాస మండల స్థాయి శిక్షకుల శిక్షణా కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. బాలికల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. గ్రామస్థాయిలో ప్రతి ఒక్కరూ బాల్య వివాహాలపై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ సౌభాగ్యమ్మ, సరళ, ప్రవల్లిక, సుబ్బలక్ష్మి, యశోద, వెంకటలక్ష్మి, గ్లోబల్ సర్వీస్ ట్రస్టు చైర్మన్ సారథి తదితరులు పాల్గొన్నారు.

పుల్లంపేటలో..

పుల్లంపేట : బాలికలకు బంగారు భవిష్యత్తు కోసమే కిశోరి వికాస కార్యక్రమమని తహసీల్దార్ అరవింద కిషోర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీపీ కార్యాలయంలో కిశోరి వికాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికలకు ఉజ్వల, ఆరోగ్యకరమైన, సాధికార, ఉజ్వల భవిష్యత్‌ను తీర్చిదిద్దడంలో సమష్టిగా కృషి చేద్దామన్నారు. అనంతరం అంగన్‌వాడీ సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. 11 నుంచి 18 సంవత్సరాల బాలికల విద్య, ఆరోగ్యం, భద్రత ఈ కార్యక్రమం లక్ష్యమన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ చక్రాధర్ రాజు, ఆర్ఐ సునీల్ కుమార్, ఐసీడీఎస్ సీడీపీఓ సౌభాగ్యమ్మ, సరళాదేవి, సూపర్‌వైజర్లు మణెమ్మ, జయలక్ష్మీ, నిర్మలాదేవి, ఏపీఎం సుబ్బలక్ష్మమ్మ, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

చిట్వేలి : అర్హులైన పేదలకు ఇంటిస్థలాలు ఇవ్వాలంటూ సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఐ నాయకులు ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ మోహన్ కృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైల్వేకోడూరు నియోజకవర్గం కార్యదర్శి జ్యోతి చిన్నయ్య, రైతు సంఘం నాయకులు తిప్పన ప్రసాద్, డీహెచ్‌పీఎస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ దార్ల నాగేశ్వరరావులు మాట్లాడుతూ సీపీఐ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ధర్నా చేపట్టామన్నారు. చిట్వేలి మండలంలోని నిరుపేదలకు ఇంటిస్థలాలు ఇవ్వాలన్నారు. ఇందుకు స్పందించిన తహసీల్దార్ మోహన్ కృష్ణ మాట్లాడుతూ అర్హులైన పేదలకు న్యాయం చేస్తామన్నారు. కార్యక్రమంలో కటారు శంకరయ్య, జి.జయరాం, పోలి దేవి, మద్దిని పుల్లయ్య, మద్దిన శ్రీనివాసులు, పేదలు పాల్గొన్నారు.

ఉప సర్పంచ్ తోట శివసాయి దాతృత్వం


సర్పంచ్, అధికారులకు రిజిస్ట్రేషన్ పత్రాలు అందజేస్తున్న ఉపసర్పంచ్ తోట శివసాయి

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు గ్రామ పంచాయతీ జగడంపల్లిలో ప్రజల రాకపోకలకు ఇబ్బందిగా ఉన్నచోట ఉప సర్పంచ్ తోట శివసాయి ఇల్లు కొని దారి ఏర్పాటు చేశారు. సోమవారం ఇందుకు సంబంధించిన రిజిస్ట్రేషన్ పత్రాలను సర్పంచ్ బుడుగు శివయ్య, ఈఓకు వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, పంజం సుకుమార్ రెడ్డి, సీహెచ్ రమేష్, కొరెడ్డి సిద్ధయ్యలతో కలిసి ఆయన అప్పగించారు. ఈ సందర్భంగా పలువురు ఆయన్ను అభినందించారు. గ్రామస్తులు ఇబ్బంది పడకుండా రోడ్లు మార్గం కోసం జాగాకొని రోడ్డు ఏర్పాటు చేయడం శుభపరిణామమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మండల నాగేంద్ర, ఎంపీటీసీలు మహేశ్వర్ రెడ్డి, అబ్దుల్, నాయకులు ఆంజనేయులు, ఫరూక్, రామచంద్రయ్య, నాగేశ్వరరావు, అనురాధ పాల్గొన్నారు.